క్లుప్తంగా

ఐరన్ ర్యాక్‌లు వితరణ



గుంటూరు మెడికల్: బీజేపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నాజ్‌సెంటర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఐరన్ ర్యాక్‌లు వితరణగా అందజేశారు. అర్బన్ పీహెచ్‌సీలో ఔషధాలు నిల్వ చేసుకునేందుకు వీలుగా ఐరన్ ర్యాక్‌లు అందించినట్లు డాక్టర్ ఉమాశంకర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వి.అనిల్ కుమార్, ఎం.ప్రవీణ్, ఎం.పవన్ కుమార్, సురేష్ కుమార్ జైన్ పాల్గొన్నారు.

వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడి

పట్నంబజారు: వ్యక్తిపై బీర్ బాటిల్‌తో దాడి చేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదయింది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు... పాత గుంటూరులో నివాసం ఉండి కంచర్ల వెంకటేష్ అతడి భార్య అక్షయ మధ్య వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్షయ బాబాయి గోపు జోజి బాబు ఆమెకు మద్దతుగా మాట్లాడి అండగా నిలబడిన క్రమంలో, ఈనెల ఆరో తేదీన వెంకటేష్ జోజి బాబును దాడి చేసి గాయపరిచాడు. నందివెలుగు రోడ్‌లోని వైన్స్ వద్ద ఒంటరిగా కూర్చుని ఉన్న జోజిబాబుపై వెంకటేష్ బీర్ బాటిల్‌తో దాడి చేసి గాయపరచగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ తరగతులు



లక్ష్మీపురం: పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. మే 5వ తేదీ నుంచి జూన్ 6 వరకు తరగతులు నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కె.నళినీకాంత్, రెడ్డిపాలెం మాజీ సర్పంచి బుజ్జి మాట్లాడారు. కార్యక్రమానికి కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం నేర్పిన శేఖర్ మాస్టర్, వలంటీర్‌గా వ్యవహరించిన బి.సుర్జిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో రాగి వెంకటేశ్వరరావు, గంట్ల బాబు, పాములు, చెంచు, శేషగిరి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని సండే మార్కెట్‌లో వాహనం పార్కింగ్ చేసి తిరిగి వచ్చి చూసే సరికి వాహనం కనిపించక పోవడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రెడ్డిపాలెం, యాదవ బజార్ ప్రాంతానికి చెందిన తాళ్ల వెంకటేష్, మే 12వ తేదీన అరండల్‌పేటలోని సండే మార్కెట్‌కు వచ్చాడు. అరండల్‌పేట 8/2వ లైన్‌లో వాహనం పార్కింగ్ చేసి తిరిగి గంట తరువాత వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల పరిశీలించి, గుంటూరు బస్టాండ్, రైల్వే స్టేషన్ పార్కింగ్ సెంటర్‌లలో ఎంత వెతుకలాడిన వాహనం కనిపించక పోవడంతో శనివారం బాధితుడు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేణుగోపాలస్వామి గ్రామోత్సవం




నగరంపాలెం: స్థానిక కొత్తపేటలోనిజగన్నాథస్వామి దేవస్థాన ఆవరణలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవేణు గోపాలస్వామి వారికి తులసి అలంకారం చేశారు. అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్సవం అనంతరం మన్యుసూక్త హోమం నిర్వహించారు. రాత్రి గుంటూరు నగర పరిసరాల్లో శ్రీ స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. దేవస్థానం ఈవో టి.సుభద్ర కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు..

స్థానిక లాలాపేటలోని పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామిని మోహిని అలంకారం చేశారు. 108 కలశలతో అష్టోత్తర సప్నన అభిషకాలు నిర్వహించారు. రాత్రి హనుమత్ వాహనంపై గ్రామోత్సవం జరగ్గా, భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు.

ట్యూమర్‌లను అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకం

- ఆధునిక ఆపరేషన్లతో ట్యూమర్లు తొలగింపు
- పిల్లల్లో, పెద్దవాళ్లలోనూ బ్రెయిన్‌ట్యూమర్‌లు
- వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నేడు



గుంటూరు మెడికల్: 'పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన శ్రీనాథ్ ఏడాదిగా తలనొప్పి, చూపు మసకగా కనిపించం లాంటి లక్షణాలతో పలు ఆస్పత్రులు తిరిగినా ఆరోగ్య సమస్య పరిష్కారం కాలేదు. చివరకు గుంటూరులో న్యూరోసర్జరీ వైద్యులను సంప్రదించగా తలలో గడ్డ ఉందని(బ్రెయిన్‌ట్యూమర్) నిర్ధారించి ఆపరేషన్ చేసి తలలో ఉన్న గడ్డను తొలగించారు.

ఆధునిక జీవనశైలి వల్ల బ్రెయిన్ ట్యూమర్లు పెరిగిపోవటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్‌లను సకాలంలో గుర్తించకపోవటంతో అవి ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డేను నిర్వహిస్తున్నారు.

లక్షణాలు...

బ్రెయిన్‌లో సర్వసాధారణంగా సెల్స్ చనిపోయి కొత్తవి పుట్టుకొస్తుంటాయి. కొన్ని సమయాల్లో కణాలు చనిపోకుండానే కొత్తకణాలు పుట్టుకొచ్చి కొత్తగా వచ్చిన కణాలు ట్యూమర్‌గా(గడ్డ) మారతాయి. కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని గడ్డలు ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పి, వాంతులు అవ్వగానే తలనొప్పి తగ్గటం జరుగుతుంది. ఎక్కువగా ఉదయం వేళల్లో ఈ సమస్య కనిపిస్తుంది. మాట్లాడటం కష్టంగా ఉంటుంది. వినికిడి సమస్య, చూపు మసకబారటం, నడవటం కష్టంగా ఉండటం తదితర లక్షణాలు ఉంటాయి. బ్రెయిన్ ట్యూమర్ సైజును బట్టి, అది బ్రెయిన్‌లో ఏర్పడిన ప్రదేశం బట్టి, ట్యూమర్ రకాన్ని బట్టి లక్షణాలు ఒక్కో మనిషిలో ఒక్కో రకంలా కనిపిస్తాయి.

బ్రెయిన్ ట్యూమర్‌కు కారణాలు...

బ్రెయిన్ ట్యూమర్‌లు జన్యుపరలోపాల వలన, వంశపారంపర్యంగా వస్తాయి. బ్రెయిన్‌కు రేడియేషన్ సోకటం, సెల్‌ఫోన్ విపరీతంగా వాడటం వలన రేడియేషన్ సోకి మెదడులో గడ్డ వచ్చే అవకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి.

జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్లు...

గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జరీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలను చేస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు నాలుగు గంటల నుండి ఎనిమిదిగంటల వరకు సమయం పడుతుంది. సుమారు మూడు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు.

బాధితులకు చికిత్స ఇలా...

బ్రెయిన్ ట్యూమర్ సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం న్యూరోసర్జరీ వైద్య నిపుణులు, న్యూరాలజిస్టులను సంప్రదిస్తున్నారు. జిల్లాలో 20 మంది న్యూరోసర్జన్లు, 25 మంది న్యూరాలజిస్టులు ఉన్నారు. వారంలో ఇరువురు లేదా ముగ్గురు బ్రెయిన్ ట్యూమర్స్ సమస్యలతో వైద్యలను సంప్రదిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో న్యూరోసర్జరీ వైద్య విభాగంలో ప్రతినెలా 20 మందికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలు చేస్తున్నారు. న్యూరోసర్జరీ వైద్య విభాగంలో 2023లో 2,011 మంది, 2024లో 2,603 మంది, 2025 జనవరి నుంచి మే వరకు 2,626 మంది చికిత్స పొందారు. న్యూరాలజీ వైద్య విభాగంలో 2023లో 16,176 మంది, 2024లో 40, 381 మంది, 2025 జనవరి నుండి మే నెల వరకు 20,765 మంది వివిధ రకాల బ్రెయిన్ సంబంధిత సమస్యలతో చికిత్స పొందారు.

ఆధునిక సర్జరీలతో మెరుగైన జీవితం

బ్రెయిన్ సర్జరీలకు ఎండోస్కోపిక్ సర్జరీలు, కీహోల్ సర్జరీలు, నేవిగేషన్ గైడెడ్, మైక్రోస్కోపిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. న్యూరోసర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఆధునిక వైద్యం ద్వారా నూటికి 95శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్స్‌లో నూటికి 10శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి.



డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, గుంటూరు

ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గర్తించవచ్చు...

న్యూరోసర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో నేడు బ్రెయిన్ ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. ట్యూమర్‌లను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. ప్రాథమిక దశలోనే తలలో గడ్డలను గుర్తిస్తే ఆపరేషన్లతో పనిలేకుండా మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. అన్ని ట్యూమర్‌లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు. జనాభాలో ఒకశాతం మంది బ్రెయిన్ ట్యూమర్స్‌తో బాధపడుతున్నారు. ప్రజలకు బ్రెయిన్ ట్యూమర్స్‌పై అపోహలు చాలా ఉన్నాయి. అవగాహన చాలా తక్కువగా ఉంది.



–డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, న్యూరోసర్జన్, గుంటూరు

జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అభినందించారు. శనివారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల ఒకటిన రేపల్లెలో జరిగిన 23వ జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు బి.సుధారాణి, కె. ఓంకారేశ్వరరెడ్డి, పి.కౌశిక్ కృష్ణ, కేవీఎస్ మణికంఠ, వి.జస్వంత్ నాలుగు బంగారు, ఒక కాంస్య పతకాన్ని సాధించినట్లు వివరించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు ఈనెల 9,10,11వ తేదీల్లో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యలో ప్రావీణ్యం సంపాదించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ప్రజలకు భారం

సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్

లక్ష్మీపురం: విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ పేరుతో వినియోగదారులపై భారం మోపుతుందని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్ పేర్కొన్నారు. బ్రాడీపేట పార్టీ కార్యాలయంలో స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ప్రచారంలో భాగంగా ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లు, పోస్టర్లలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి మీటర్ బిగించేటప్పుడే మూడు నెలల అడ్వాన్స్ బిల్లు డిపాజిట్‌గా కట్టించుకుంటూ, ప్రీ పెయిడ్ పద్ధతి తీసుకురావడం అన్యాయం అని అన్నారు. పీక్ అవర్స్‌లో స్మార్ట్ మీటర్ ద్వారా అదనపు చార్జీ వసూలు చేసేలా మరో దుర్మార్గపు ఎత్తుగడకు ప్రభుత్వం పాల్పడనుందని అన్నారు. సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య, ఎండాకాలంలో పగలు పూట వాడే కరెంటుకు ఎక్కువ చార్జీ వసూలు చేయటం ఈ స్మార్ట్ మీటర్ ప్రత్యేకత అని ఆరోపించారు. ఇప్పటి వరకు తక్కువ యూనిట్లు కరెంటు కాల్చే పేదవాళ్లకు తక్కువ బిల్లు వచ్చేదని, రాబోయే కాలంలో ఈ అవకాశం ఉండదన్నారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ స్మార్ట్ మీటర్ ఖర్చు రూ.15 వేలు బలవంతంగా ప్రజలతో కట్టించే ఏర్పాట్లు ప్రభుత్వం చేసిందన్నారు. 96 నెలల్లోపు ఈ బిల్లు చెల్లించాలని ఉత్తర్వులలో పేర్కొందని వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను, ట్రూ ఆఫ్, ఇంధన సర్దుబాటు చార్జీలను, విద్యుత్ సెకీ ఒప్పందాలను తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం నేతలు అధికారంలోకి రాగానే వాటినే కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశిం షహీద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నళినీకాంత్

లైంగిక దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూ నగర్: అనంతపురం జిల్లాలో దళిత బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, హోంమంత్రి దళిత మహిళ అయినప్పటికీ ఈ విషయంలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

రజక కమ్యూనిటీ హాల్ కేటాయించాలి

ఎమ్మెల్యే మాధవికి వినతి

లక్ష్మీపురం: రజక కమ్యూనిటీ హాల్, వివిధ సామాజిక కుటుంబ ఫంక్షన్ హాల్‌కు స్థలం కేటాయించాలని రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు తెలిపారు. గుంటూరులోని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గల్లా మాధవికి రజక సంఘ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రజక సామాజిక వర్గానికి ఫంక్షన్ హాల్ లేక పోవడం వలన రజకులు ఆర్థిక స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగరపాలక సంస్థ ద్వారా తీర్మానం ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. నగరంలోని అనేక ప్రాంతాలలో తమ సామాజిక వర్గానికి చెందిన వారు నివసిస్తున్నారని వారికి ఇంటి నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు హైకోర్టు న్యాయవాది తుమ్మలపూడి శ్రీధర్, సంఘం జిల్లా అధ్యక్షులు మందూరు వెంకట నరసయ్య, జిల్లా కోశాధికారి వెంపాటి చిన్న కొండయ్య, నగర అధ్యక్షులు బెండమూరి లంక కైలాసం, భాస్కరరావు, లంక సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గల్లా మాధవికి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘ నాయకులు

అలరించిన భక్తి సంగీత విభావరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీవాణీ కళానికేత్ నిర్వాహకులు భాగినారాయణశాస్త్రి భక్తి గీతాలు, శ్రీఅన్నమాచార్యుల సంకీర్తనలు ఆలపించారు. అనంతరం దేవాలయ పాలకవర్గం భాగినారాయణశాస్త్రి బృందాన్ని సత్కరించి, స్వామి ప్రసాదాలు అందించారు.



శృంగేరి శ్రీవిరూపాక్ష పీఠానికి యతీశ్వరులు రాక

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డరోడ్డులోని శృంగేరీ శ్రీవిరూపాక్ష పీఠం ఉత్తర పీఠాధిపతి శ్రీపర శివానంద భారతీస్వామిని శనివారం భారతీ సంప్రదాయ యతీశ్వరులు నరసింహ భారతీ, వాసుదేవానంద భారతీ, ఆదిత్యానంద భారతీ, హంస శివానంద భారతీస్వామి, ఆధ్యాత్మిక సాధనాపరులు ఎస్వీఎస్ సోమయాజి, లలితేంద్ర యోగి, మున్నంగి వెంకటరాయశర్మ అభినందించారు. జగద్గురువులు పరశివానందభారతీస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ శ్రీజగద్గురు ఆదిశంకరాచార్యులు నెలకొల్పిన శృంగేరీ గురు పీఠం శ్రీవిద్యారణ్య మహాస్వామి ఆశీర్వాద బలంతో విజయనగర సామ్రాజ్యం 25 ఏళ్ల అవిచ్ఛిన్నంగా పాలించబడిందని అన్నారు. కార్యక్రమంలో పీఠం కార్యదర్శి గబ్బిట శివరామకృష్ణప్రసాద్, సభ్యులు బిఎస్ఆర్ కృష్ణప్రసాద్, ఎంఆర్‌కే.పరమహంస, యాబలూరి లోకనాథ శర్మ, చింతలపాటి వెంకట్రామయ్య పాల్గొన్నారు.



పరశివానంద భారతీస్వామిని అభినందిస్తున్న యతీశ్వరులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో రూ.1.60 లక్షల మోసం

లక్ష్మీపురం: సాఫ్ట్ వేర్ సంస్థలో ఉద్యోగానికి రూ.1.60 లక్షలు చెల్లించి ఉద్యోగ వకాశం కల్పించకుండా మోసం చేసిన వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదిత్యనగర్ 2వ లైన్‌కు చెందిన ఎస్.గురు అరవింద్ అనే యువకుడు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం వెతుకలాడుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన షేక్ సద్దాం అనే యువకుడుని సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం అవకాశం కల్పించాల్సిందిగా కోరాడు. అయితే సద్దాం సెనో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పాడు. దీంతో గురు అరవింద్ సంస్థ మేనేజర్ సుహాస్‌ను పరిచయం చేసుకుని ఉద్యోగం కోసం అడుగగా అతనితో పాటు ప్రసాద్ రెడ్డి, హేమంత్‌కుమార్ అనే వారు ఈ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం కోసం రూ.1.80 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో గురు అరవింద్ గత ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన రూ.1.60 లక్షలు చెల్లించాడు. అప్పటి నుంచి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో మోసానికి గురైనట్లు గుర్తించిన గురు అరవింద్ అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సువర్ణ భారతి క్షేత్రం భూమిపూజ

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులో నూతనంగా నిర్మించనున్న శ్రీసువర్ణ భారతీ క్షేత్రం (సరస్వతి దేవాలయం) భూమిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు స్వామీజీల ఆధ్వర్యంలో వేదపండితులు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి సరస్వతి దేవాలయం లక్ష పలకలతో తెనాలిలో నిర్మించటం గొప్ప విషయమని చెప్పారు. సరస్వతి దేవి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. పెద్దపులిపాక శ్రీవిజయ రాజ రాజేశ్వరి శ్రీవిద్యా పీఠం పీఠాధిపతులు శ్రీవాసుదేవానందగిరి స్వామి భూమిపూజలో పాల్గొని విశేష ప్రవచనం చేశారు.

కారు-ద్విచక్ర వాహనం ఢీ



తాడికొండ: కారు-ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. మేడికొండూరు మండలం నుంచి తుళ్లూరు మండలం పెదపరిమిలో శుభకార్యానికి కారు వెళుతోంది. ఈ సమయంలో తాడికొండ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తాడికొండ అడ్డరోడ్డులో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, ద్విచక్ర వాహనం ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నఇద్దరి యువకుల్లో ఒకరికి కాలు విరిగి తలకు బలమైన గాయం కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను ఆటోలో గుంటూరు ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

జంతువుల పెంపకానికి అనుమతి తప్పనిసరి

- రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న వివిధ జంతువులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



కొత్తపేట మెయిన్‌రోడ్డులో రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

నెహ్రూనగర్: నగరంలో విచ్చలవిడిగా ఆవులు, గాడిదలు, కుక్కలు విచ్చల విడిగి తిరుగుతుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ఆవులు గుంపులు గుంపులుగా రోడ్ల మీద చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు రోడ్లపై పెంపుడు జంతువులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఆవుల యాజమానులతో..

కొంత మంది ఆవుల యాజమానులు తమ కక్కుర్తితో ఇంటిలో పెంచుకోవాల్సిన ఆవులను, రోడ్ల మీద మేత కోసం రాత్రి వేళల్లో తీసుకువచ్చి వదిలేస్తున్నారు. దీంతో ఆ ఆవులన్నీ రోడ్ల మీద గుంపులు కనిపిస్తున్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆవులు కూడా ప్రమాదంలో గాయాలపాలవుతున్నాయి. కొన్ని మృత్యువాత పడతున్నాయి. అదే వరసలో గాడిదలు, కుక్కలు, పందులు కూడా ఉన్నాయి.

యాజమానులకు నోటీసులు

మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 సెక్షన్ 254 ప్రకారం నగరపాలక సంస్థ పరిధిలోని గృహస్తులు తమ సొంత నివాస ప్రాంగణంలో ప్రజలకు ఇబ్బంది, ప్రజారోగ్యానికి హానికరమైన ఎటువంటి జంతువులను కలిగి ఉండడానికి వీలు లేదని చట్టం చెబుతుంది. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 సెక్షన్ 255 నిబంధనల మేరకు లైసెన్స్ లేని ఆవులు, గాడిదలు, కుక్కలను డబ్ల్యూపీ నంబర్ 17791 ఆఫ్ 2017 హైకోర్ట్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 సెక్షన్ 510 మేరకు పందులను నిర్మూలన చేయుటకు నగరపాలక సంస్థకు అధికారాలు తగిన అధికారాలున్నాయి. సదరు ప్రాంతాల్లో పరిసర ప్రాంత ప్రజలకు అనారోగ్య సమస్యలు రాకుండా తగు పారిశుధ్య నిర్వహణ చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ నుంచి పెంపుడు జంతువుల నిర్వహణ నిమిత్తం అనుమతి తీసుకుంటే నగరపాలక సంస్థ జారీ చేసిన లైసెన్స్ ట్యాగ్‌లను ఆవులు, కుక్కలు, పందులు, గాడిదల మేడలో వేయాల్సి ఉంటుంది.

నిబంధనల మేరకు అనుమతి

మున్సిపల్ చట్టం ప్రకారం పెంపుడు జంతువుల యాజమానులు జంతువులను పెంచుకునేందుకు తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. కొంత మంది ఆవులను రోడ్లపై యథేచ్ఛగా వదిలేస్తున్నారు. అటువంటి వాటిని బందెల దొడ్డికి తరలించి, మున్సిపల్ చట్టం ప్రకారం యాజమానులపై తగిన చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ వెంకటేశ్వర్లు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, జీఎంసీ